
కొండాపురంలోని ఏటూరులో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీకి భూకుంభకోణాలు, ఇసుక, మట్టి, రౌడీయిజం పెద్ద డ్యామేజీ. ఇవే ఆ పార్టీని ఎన్నికల్లో చావుదెబ్బ కొట్టాయి. దీనిని గుణపాఠంగా తీసుకోవాల్సిన కొందరు కూటమి నేతలు.. వైసీపీ వారు చేసిన పనులనే ఆదర్శంగా తీసుకున్నారు. వక్రమార్గంలో నడుస్తున్నారు. ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్ల నుంచి అదనంగా రూ.3వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దంటూ సీఎం చంద్రబాబు పదే పదే హెచ్చరిస్తున్నా.. మేం ఇంతే.. మేం మారం అన్న రీతిలో కొందరు కూటమి నేతలు వ్యవహరించడం చూసి సొంత పార్టీ నేతలే జీర్ణించుకోలేకపోతున్నారు.

వీళ్లూ.. మారరంతే!

- వైసీపీ పోకడలను అనుసరిస్తున్న కొందరు కూటమి నేతలు
- సీఎం చంద్రబాబు వద్దు వద్దన్నా.. ఇసుక, గ్రావెల్‌పై కన్ను
- టిప్పర్, ట్రాక్టర్ల నుంచి అదనంగా రూ.3వేలు వసూళ్లు
- వీఎన్‌పల్లె, కొండాపురంలో కూటమి నేతల దందా
- చంద్రబాబు ఆశయాన్ని నీరుగార్చుతున్న కూటమి నేతలు
- సీరియస్‌గా యాక్షన్ తీసుకోకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ఉన్నతాశయంతో ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్నారు. రవాణా, హ్యాండ్లింగ్ చార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంది. ఇప్పుడు నదుల్లో వరద నీరు ఉండడంతో ఇంకా కొత్త రీచ్‌లు మొదలుపెట్టలేదు. దీంతో జిల్లా అంతటా కలసి రెండుచోట్ల మాత్రమే ఇసుక విక్రయ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా అవసరాలకు సరిపడా ఇసుక అందుబాటులో లేకపోవడం ఒక ఎత్తయితే రెండు కేంద్రాలే ఉండడంతో జిల్లా సరిహద్దుల్లోకి వెళ్లేసరికి రవాణా చార్జీ ఎక్కువ అవుతుంది. ఇలాంటి చోట కూడా కొందరు కూటమి నేతలు ఇసక అక్రమాలకు పాల్పడుతున్నారు. వీఎన్‌పల్లె, కొండాపురంలో ఇసుక రీచ్‌లు, స్టాకు పాయింట్ల వద్ద టిప్పరు, లారీలకు అదనంగా రూ.3వేలు వసూలు చేస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కష్టపడుతుంటే కొందరు కూటమి నేతలు చేసే పనులు పార్టీకి తీరని నష్టం చేకూరుస్తున్నాయని పలువురు టీడీపీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మేమింతే

వీరపునాయునిపల్లె మండలంలోని సంగమేశ్వరదేవస్థానం సమీపంలో వీరబల్లె ఇసుక స్టాకు పాయింటు వద్ద అధికార పార్టీ నాయకుల చిలక్కొట్టుడుపై ఇటీవలే ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. కలెక్టరు శివశంకర్ సీరియస్ కావడంతో హుటాహుటిన అధికార యంత్రాంగం అక్కడికి వెళ్లింది. ఓ వీఆర్వో మేం డబ్బులు ఇవ్వలేదు.. అనే అర్జీని ముందుగానే తయారు చేసుకుని దానిపై టిప్పరు డ్రైవర్లతో సంతకాలు పెట్టించుకున్నారు. రెండు మూడురోజుల పాటు అదనపు వసూళ్లు నిలిపివేశారు. తిరిగి సోమవారం నుంచి మొదలుపెట్టారు. ఇసుక బుకింగ్ స్టాకు పాయింట్ వద్ద కాకుండా అనిమెల సచివాలయంలో బుక్ చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో కూటమి నేతలు సచివాలయం వద్ద మకాం వేసి ఇసుక కోసం వచ్చినవారి నుంచి ఆధార్‌కార్డులు తీసుకుని మీరు అక్కడికి వెళ్లిపోండి, మేమే కూపన్లు తీసుకువస్తాం అని చెబుతున్నారు. ప్రభుత్వానికి టన్నుకు రూ.340 వంతున చెల్లిస్తారు. టిప్పరుకు 21 టన్నులు ఇసుక వేస్తారు. ఒక్కో టిప్పరుకు అదనంగా రూ.2వేల నుంచి రూ.3వేలు తీసుకుంటున్నారు. కడప, కమలాపురం, పులివెందులకు వెళ్లే వాహనాలకు అయితే రూ.2వేలు మైదుకూరు, బద్వేలు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు, కొమ్మరోలు, మార్కాపురం వెళ్లే వాహనాలకు రూ.3వేలు పైచిలుకు వసూలు చేసినట్లు చెబుతున్నారు. వారికి 2వేలు, మాకు 3వేలు ఏంటని కొందరు అడిగితే... మీ దగ్గర ఇసుక ధర ఎక్కువ అందుకే అని చెబుతున్నారు. ఆదివారం సాయంత్రమే ఓ అధికారి టిప్పర్ల యజమానుల నుంచి అదనంగా డబ్బులు తీసుకుని కూపన్లు ఇచ్చారని సమాచారం. ఈ విషయం కూటమి నేతలకు తెలియడంతో వీరూ అదేపని మొదలు పెట్టారు. ఓ మండ ల కీలక నేత సుమారు 40 కూపన్లు రాయించుకున్నట్లు చెబుతున్నారు. ఈయనకు ఒక్కరికే సోమవారం సుమారు లక్షకు పైగా జేబులోకి వెళ్లిందంటారు.

కొండాపురంలోనూ ఇంతే

కొండాపురంలోని ఏటూరు వద్ద వారం కిందటే ఇసుక రీచ్ ప్రారంభం అయింది. ఏటూరు వద్ద 5,600 టన్నుల ఇసుక ఉండగా, పి.అనంతపురం స్టాకు పాయింటులో 2,100టన్నులు ఉంది. ఇక్కడ కూడా వీఎన్‌పల్లె తరహాలోనే కూటమి నేతలు రూ.3వేలు వసూలు చేస్తున్నారని అంటున్నారు. టిప్పరు, లారీకి అదనంగా రూ.3వేలు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. డబ్బులు కడితేనే కూపన్లు ఇస్తున్నారు. జిల్లాలో కేవలం ఈ రెండు చోట్లనే ఇసుక లభ్యత ఉంది. జిల్లా సరిహద్దు అయిన కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన, బద్వేలు, గోపవరం ప్రాంతాలకు వెళ్లేసరికి రవాణా చార్జీతో కలిపి సుమారు రూ.35వేలకు పైగా పడుతుంది. అయితే ఇప్పుడు కూటమి నేతలు వేసిన ట్యాక్స్ జనాలకు భారంగా మారుతోంది. కడపలో టిప్పరు ఇసుక ఇప్పుడు రూ.21వేలకు చేరింది.

చర్యలు తీసుకోవాల్సిందే

చంద్రబాబు ప్రభుత్వంపై జనాల్లో సానుకూలత ఉంది. మరింత ఫీల్ గుడ్ కోసం చంద్రబాబు కష్టపడుతుంటే కొందరు కూటమి నేతలు చిల్లర పనులు చేస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తున్నారు. వేటిల్లో వేలు పెడితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందో వాటిల్లోనే వేలు పెట్టి సొంత జేబులు నింపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి వారిని ఉపేక్షిస్తే చెడ్డపేరు వస్తుంది. అటు పార్టీ పరంగా చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమాలను ప్రోత్సహిస్తున్న అధికారుల తీరుకు ఆదిలోనే అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.


అనిమెల సచివాలయం వద్ద ఆధార్‌కార్డులు తీసుకుంటున్న నేతలు


కొండాపురంలోని ఏటూరులో ఇసుక లోడింగ్ కోసం బారులు తీరిన టిప్పర్లు


ఎర్రబల్లె స్టాకు పాయింటులో ఇసుక లోడింగ్

ఇడుపులపాయలో తండ్రి వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న షర్మిల



రాష్ట్రాభివృద్ధిని నీరుగార్చారు

- సీఎంగా స్టీల్‌ప్లాంట్‌ను జగన్ పట్టించుకోలేదు
- ప్రత్యేక హోదా గురించి మాట్లాడనే లేదు
- కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

వేంపల్లె, సెప్టెంబరు 2: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఐదు సంవత్సరాలలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధిపరిచారని తర్వాత వచ్చిన వారు రాష్ట్రాభివృద్ధిని నీరుగార్చారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఇడుపులపాయ ఘాట్‌లో ఆమె సోమవారం వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం ప్రజలందరికి తీరనిలోటని అన్నారు. ఆయన మరణంతో 700 కుటుంబాల్లో విషాదం నెలకొందని ఆవేదన వెలిబుచ్చారు. ఆయనలా తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు ఎవ్వరూ పరిపాలన చేయలేదన్నారు. జలయజ్ఞం అటకెక్కించారు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీలను పట్టించుకోలేదని అన్నారు. ప్రత్యేకహోదా గురించి మాట్లాడే వారే కరువయ్యారన్నారు. సీఎం అయిన వైఎస్ జగన్ జిల్లావాసిగా కనీసం స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ఏమాత్రం ప్రయత్నం చేయలేదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బీజేపీని ఎప్పుడూ వ్యతిరేకించేవారని ఆయన ఆశయాలను సాధించకపోగా బీజేపీకి గులాంగిరి చేస్తున్నారని జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. వైఎస్సార్ ఆశయసాధనకు కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉందని, ఆయన బిడ్డగా ముందుకు సాగుతానని ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు.

వైఎస్సార్‌కు జగన్, షర్మిల వేర్వేరుగా నివాళి

ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఆయన పిల్లలు జగన్, షర్మిల వేర్వేరుగా నివాళి అర్పించారు. మొదట మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భార్య వైఎస్ భారతి, తల్లి విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు సుధీకర్‌రెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇతర ముఖ్యనేతలతో కలిసి సోమవారం ఉదయం 7.30గంటల ప్రాంతంలో వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. ఫాదర్ నరేశ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఘాట్ ఆవరణలోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి మొక్కుకున్నారు. ఆయన వెంట తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు అమర్‌నాథరెడ్డి, డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రనాథరెడ్డి, అంజాద్‌బాషా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. 8గంటలకు జగన్ ఇడుపులపాయ నుంచి బయలుదేరి రోడ్డుమార్గాన కడప చేరుకుని అక్కడి నుంచి విమానంలో విజయవాడ వెళ్లారు. ఇడుపులపాయ నుంచి జగన్ వెళ్లిన 15 నిమిషాలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తల్లి విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు సుధీకర్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులతో కలిసి వైఎస్సార్ ఘాట్‌కు చేరుకున్నారు. తండ్రి సమాధి వద్ద పూలమాల ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఫాదర్ నరేశ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఘాట్ ఆవరణలోని తండ్రి విగ్రహానికి పూలమాల వేశారు. వైఎస్సార్ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు తులసిరెడ్డి, అఫ్జల్‌ఖాన్, సల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


ఇడుపులపాయలో తండ్రి వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న జగన్

ఆదమరిస్తే అంతే గతి!

- జనావాసాల్లో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- వర్షాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం


బళ్లారి రోడ్డులో..

కడప (క్రైం), సెప్టెంబరు 2: నగరంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో 12 సంవత్సరాల విద్యార్థి చనిపోగా.. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. అయినా విద్యు త్ అధికారులు మేలుకోలేదు. అసలే వానలు పడుతు న్నాయి. జనావాసాల మధ్య చేతికందే ఎత్తులోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. చాలా చోట్ల వాటికి కంచె కూడా లేకపోవడంతో ఇవి ప్రమాదకరంగా మారాయి. ఫ్యూజ్ బాక్స్ వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయి. మరికొన్ని చోట్ల ఏదైనా పెద్ద వాహనం వెళితే ట్రాన్స్‌ఫార్మర్ తగలాల్సిందే. విద్యుత్ వైర్ల కిందనే కేబుల్ వైర్లు సైతం ఉన్నాయి. ఇక్కడ ఏమాత్రం ఏమారినా ప్రమాదమే.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు

కడప నగరంలో పలు ప్రాంతాల్లో తక్కువ ఎత్తులో కంచె కూడా లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఇవి చిన్నపిల్లలకు సైతం అందే విధంగా ఉన్నాయి. అశోక్ నగర్, మాసాపేట, బళ్లారిరోడ్డు, సాయిపేట, అల్మాస్ పేట, మోచంపేట తదితర ప్రాంతాల్లో కంచెలేని ట్రా న్స్‌ఫార్మర్లు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతాల్లో వెళ్లాలంటే ప్రమాదం పొంచి ఉంటోంది. కొన్నిచోట్ల విద్యుత్ తీగలు సైతం జాయింటు అయి మంటలు చెలరేగుతూ కనిపిస్తున్నాయి. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న విద్యుత్ ఎర్త్ వైరు తెగి కేబుల్ వైరుకు తగులుకుని ఇద్దరు పిల్లలు కరెంటు షాక్‌కు గురై ఒకరు చనిపోగా ఇంకొక పిల్లవాడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హడావిడిగా పరు గులు తీయడం కన్నా.. ప్రజల ప్రాణాలకు హాని జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని పలువు రు కోరుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫా ర్మర్ల చుట్టూ రక్షణ కంచె కానీ గోడ కానీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.


మాసాపేట ట్యాంకు వద్ద..

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ శివశంకర్


విభిన్న ప్రతిభావంతుడు ఖదీర్‌కు వీల్ చైర్ అందజేసిన కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 2: జిల్లా నలుమూలల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అంతకు ముందు ఉదయం 9-30 గంటల నుంచి 10-30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి ఫోన్ ద్వారా మొత్తం 8 మంది తమ సమస్యలను విన్నవించారు. కాగా.. వల్లూరు మండలం, అంబవరానికి విభిన్న ప్రతిభావంతుడు ఏ.ఖదీర్ అనే యువకుడిని అతని తల్లిదండ్రులు చేతులపై మోసుకుంటూ కలెక్టరేట్‌కు వచ్చారు. దీనిని గమనించిన కలెక్టర్ విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిశోర్‌తో మాట్లాడి కొత్త వీల్‌చైర్ తెప్పించి ఖదీర్‌కు అందించారు. త్వరలో పింఛన్ సదుపాయాన్ని కల్పిస్తామని వారికి హామీ ఇచ్చారు.

ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి

- ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు


ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

కడప (క్రైం), సెప్టెంబరు 2: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్దీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత నిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీసుస్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు పాల్గొన్నారు.

గండిలో మత్తు పదార్థాలు నిషేధం


దుకాణాల్లో తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్న నిషేధిత పదార్థాలు

చక్రాయపేట, సెప్టెంబరు 2: రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సిగరెట్లు, బీడీలు, మత్తుపదార్థాలు నిషేధిస్తూ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య గత నెల 7వ తేదీన దుకాణ యజమానులకు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రావణ మాసోత్సవాలు ఉండటంతో తమకు 30వ తేదీ వరకు గడువు ఇవ్వాలని స్థానికులు కోరగా అందుకు ఆయన సమ్మతించారు. అనంతరం 1వ తేదీ నుంచి ఈ నిషేధ ఉత్తర్వులు అమలులోకి వచ్చాయి. ఈ మేరకు పదేపదే మైకులో సైతం దుకాణదారులను హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రతి దుకాణాన్ని అధికారుల బృందం తనిఖీ చేయగా భారీఎత్తున సిగరెట్లు, బీడీలు, గుట్కాలాంటి ప్యాకెట్లు పట్టుబడ్డాయి. వాటిని ఒకచోట వేసి కాల్చివేశారు. గండి దేవస్థానంలోకి ఎవరైనా తాగి వస్తే బ్రీతింగ్ అనలైజర్‌తో చెక్ చేస్తామని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సహాయమాత.. ఆరోగ్యమాత



కడప (కల్చరల్), సెప్టెంబరు 2: మరియతల్లి ఆరోగ్యమాత ఎల్లవేళలా మనకు సహాయం చేస్తుందని, ఆ తల్లి మనతో ఉంటే ఆరోగ్యము, సిరిసంపదలకు కొదవే ఉండదని చిత్తూరు డీన్ కొత్తపల్లి మిట్ట విచారణ గురువులు ఫాదర్ జేమ్స్, శ్రీకాళహస్తి విచారణ గురువులు ఫాదర్ కిరీటం పేర్కొన్నారు. ఆరోగ్యమాత ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజైన సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీప ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో కిరీటం దివ్య బలిపూజ సమర్పించగా.. జేమ్స్ మరియమాత సందేశాన్ని విశ్వాసులకు వివరించారు. కానాపల్లె పెళ్లికి మరియతల్లిని పిలువగా ఆ వివాహ విందులో కొరతపడిన ద్రాక్ష రసాన్ని ఆమె తన కుమారుడు క్రీస్తుప్రభువు ద్వారా అందజేసి వారి గౌరవాన్ని కాపాడిందన్నారు. కనుక ఆ తల్లిని మన వెంట ఉండేలా ఆహ్వానించాలన్నారు. పూజ ప్రార్థనలో ప్రత్యేకంగా అలంకరించిన మరియతల్లి భక్తిశ్రద్ధలతో విశ్వాసులు సందర్శించారు.

గురుకుల పాఠశాలలో దారుణం

- బాలికను లైంగికంగా వేధించిన ప్రిన్సిపాల్ భర్త
- పాఠశాల ఎదుట బాలికల ఆందోళన
- సందర్శించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్
- నిందితుడిపై ఎస్సీ,ఎస్టీ, పోక్సో కేసులు నమోదు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 2: అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో దారుణం చోటు చేసుకుంది. పిల్లలను కన్న బిడ్డల్లా చూసుకోవాల్సింది పోయి.. ఐదోతరగతి చదివే పదేళ్ల బాలికపై ప్రిన్సిపాల్ భర్త లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసి బాలికలంతా పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. మంత్రి, కలెక్టర్ అక్కడకు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. నిందితుడిపై చర్యలకు ఆదేశించారు. వివరాలిలా...

లక్కిరెడ్డిపల్లెలో అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలకు పరిమళ ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆమె కుటుంబ సభ్యులతో కలసి పాఠశాల ఆవరణలోని క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ప్రిన్సిపాల్ భర్త బాలసుబ్బయ్య ఐదో తరగతి చదువుతున్న బాలికను తన దగ్గకు పిలిచి లైంగికంగా వేధించాడు. తిరిగి వచ్చిన బాలిక భయంతో వణుకుతూ పడుకుంది. గమనించిన తోటి బాలికలు రాత్రి విధుల్లో ఉన్న టీచర్‌కు చెప్పారు. ఆమె బాలికతో మాట్లాడి వెంటనే స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ బాలికలను పిలిచి ఎవరికైనా చెబితే టీసీలు ఇచ్చేస్తామని బెదించారు. అయినా ఈ విషయం సోమవారం బయటకు పొక్కడంతో విలేకరులు అక్కడకు వెళ్లారు. వారి ఎదుట పలువురు విద్యార్థినులు తమ ఆవేదన వెలిబుచ్చారు. అందరూ పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ భర్త రోజూ రాత్రిపూట మరో ముగ్గురిని తీసుకొచ్చి పాఠశాలలో మద్యం తాగుతాడని, వారికి ప్రిన్సిపాల్ తమచేతనే తినుబండారులు పంపిస్తుందని అన్నారు. ఉదయం 10వతరగతి, ఇంటర్ విద్యార్థులు స్నానాలు చేసేటప్పుడు వచ్చి తొంగి చూసేవాడని, ఫొటోలు వీడియోలు కూడా తీసి బెదిరిస్తున్నాడని అన్నారు. ప్రిన్సిపాల్ డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు. ఆమె భర్తను ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, తహశీల్దార్ లక్ష్మిప్రసన్న, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి అక్కడకు చేరుకుని పిల్లలను విచారించారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాలికను పరామర్శించారు. బాలిక కుటుంబానికి లక్ష రూపాయాలు అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్ పరిమళను వెంటనే సస్పెండ్ చేసి ఆమె భర్త బాలసుబ్బయ్యపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ సైతం బాలికల గురుకుల పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడారు. ప్రత్యేక నిఘా పెట్టి బాలికలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా బాలికలు కలెక్టర్ ఎదుట బోరున విలపించారు. ప్రిన్సిపాల్ భర్త తమ శరీరాలు తడుముతాడని తెలిపారు. ప్రిన్సిపాల్ తమ ఫొటోలు తీసి భర్తకు పెట్టి వీరిలో ఎవరుకావాలి చూసుకోమని చెబుతుందని విద్యార్థులు వాపోయారు. స్నానం చేసే సమయంలో లోపలికి వస్తాడని ఆవేదన వ్యక్తం చేవారు. దీంతో కలెక్టర్ ప్రిన్సిల్‌ను వెంటనే సస్పెండ్ చేయడమే కాకుండా ఆమె మీద, ఆమె భర్తమీద క్రిమినల్ కేసులు బనాయించాలని పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లె పోలీసులు ఎస్సీ,ఎస్టీ, పోక్సో కేసులు నమోదు చేశారు.


అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల వద్ద విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

యువకుడి ఆత్మహత్య

కడప (క్రైం), సెప్టెంబరు 2 : కడప నగరం సెవెన్‌రోడ్స్ సమీపంలోని జిలేబీ తయారీ దుకాణంలో యువ కుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కడప వన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉపేంద్రకుమార్ (24) కొన్నేళ్లుగా కడప సెవెన్‌రోడ్స్‌లోని జిలేబీ దుకాణంలో పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఎవరూ పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం దుకాణంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి ఆ మేరకు అతని బంధువులకు సమాచారం అందించినట్లు తెలిపారు. తన కుటుంబ సభ్యులు పట్టించుకోవడంలేదని అందుకే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఆత్మహత్యకు ముందు లెటరు రాసినట్లు తెలిపారు.

ఘర్షణలో ఆరుగురికి గాయాలు

సికెదిన్నె, సెప్టెంబరు 2: ఇరువర్గాల మధ్య ఘర్షణలో ఆరుగురికి గాయాలైనట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. తమ కొడుకును సినిమాల పేరుతో తిప్పి చెడగొడుతున్నారని ఆదివారం చింతకొమ్మదిన్నె మండలం నర్సన్నపల్లెకు చెందిన వీరంరెడ్డి శివశంకర్‌రెడ్డి భార్య లక్ష్మీదేవి వీరంరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను తిట్టడంతో గొడవ ప్రారంభమైంది. ఈ గొడవలో వీరంరెడ్డి వెంకటరామిరెడ్డి, వీరంరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వీరంరెడ్డి చిన్నసుబ్బారెడ్డి తోపాటు వీరంరెడ్డి శంకర్‌రెడ్డి, నరసింహారెడ్డికి గాయాలయ్యాయన్నారు. వారిని ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు



రోడ్డుపై పడిఉన్న క్షతగాత్రులు

కాశినాయన సెప్టెంబరు 2: ఆటో బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. బద్వేలు కోట వీధికి చెందిన కొందరు సోమవారం జ్యోతి క్షేత్రం నుంచి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కేతిబోయిన వెంకటయ్య కాలు విరగగా కోళ్ళ శీను, కోళ్ళ రమణయ్యకు రక్తగాయాలు అయ్యాయి. ఆ మార్గంలో వెళ్తున్న అంబేడ్కర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్యాల ప్రసాద్ 108 సమాచారం ఇచ్చారు. వారు సకాలంలో స్పందించకపోవడంతో కాశినాయన మండల పోలీసులకు, కడప డీఎంహెచ్‌వోకు సమాచారం ఇచ్చారు. సంఘటన జరిగి దాదాపు 2గంటల తర్వాత 108 వాహనం రావడంతో క్షతగాత్రులను పోరుమామిళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం మత్తు మూలంగానే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితులు, ఎర్రచందనం దుంగలు, పట్టుబడిన వాహనాలతో ఫారెస్టు అధికారులు

బద్వేలు రూరల్, సెప్టెంబరు 2 : అక్రమంగా తరలిస్తున్న ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి ఫారెస్టు ఆఫీసరు శేషయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు సోమవారం తెల్లవారుజామున బద్వేలు అటవీ రేంజి పరిధిలోని లోతువంక బీట్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక ఆటో, ఒక కారు ఒకదాని వెనుక ఒకటి వచ్చాయి. వాటిని ఆపి తనిఖీ చేయగా కారులో ఐదు ఎర్ర చందనం దుంగలు పట్టుబడ్డాయి. కారు డ్రైవరు పారిపోగా, ఆటోలో ఉన్న చిత్తూరుకు చెందిన రేవంత్ బాబు, తమిళనాడుకు చెందిన శేఖర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరు రూట్ క్లియరెన్స్ చేసేందుకు కారుకంటే ముందుగా వచ్చినట్లు విచారణలో తేలిందన్నారు వీరికి కేరళ చెందిన ఎర్రచందనం స్మగ్లరు నాసర్‌భాయితో సంబంధాలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, సెప్టెంబరు 2: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని జలాశయ డీఈఈ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. పెన్నానదికి 400 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 50 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 60 క్యూసెక్కుల మేర నీరు వదులుతున్నామని పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గండికోట జలాశయం నుంచి 2,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందన్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 6.500 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలాశయంలో 5.240 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

చేపల వేటకు లైసెన్స్ తప్పనిసరి

కొండాపురం, సెప్టెంబరు 2: జిల్లాలోని గండికోట, సోమశిల వెనుక జలాలు, బ్రహ్మసాగర్ రిజర్వాయర్లలో చేపల వేటకు లైసెన్స్ తప్పనిసరి అని జిల్లా ఉప మత్స్య సంచాలకులు కె.శాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 వ తేదీ నుంచి జలాశయంలో వేటాడే ప్రతి మత్స్యకారుడు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ద్వారా లైసెన్స్‌లు పొందాలన్నారు. లేకుంటే ఏపీ ఫిషరీస్ రూల్స్ 1995 ప్రకారం కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ముగిసిన బీఈడీ పరీక్షలు



బీఈడీ పరీక్షలను తనిఖీ చేస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 2 :వైవీయూ బీఈడీ సెమిస్టరు పరీక్షలు సోమవారం ముగిశాయి. గత నెల 27న జిల్లాలో 16 కేంద్రాల్లో ప్రారంభమైన ఈ పరీక్షలకు 4,062 మంది విద్యార్థులు హాజరయ్యారు. కడప నగరంలో ఎస్వీ బీఈడి కాలేజీ, శ్రీహరి డిగ్రీ కళాశాల, లేవాకు నారపరెడ్డి బీఈడీ కళాశాల, భరత్ బీఈడీ కాలేజీ కేంద్రాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్లు రఘునాథరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు.

మరమ్మతులు చేయించండి.. మహాప్రభో..!

- కూలడానికి సిద్ధంగా తరగతి గదులు
- బిక్కు బిక్కు మంటూ విద్యార్థులు
- బురదలో నరకయాతన
- నిర్లక్ష్యంతో ఆగిన నాడు-నేడు పనులు
- పాఠశాల భవనం ప్రారంభించాలని తల్లిదండ్రుల వినతి



సింహాద్రిపురం, సెప్టెంబరు 2: స్థానిక జడ్పీ హైస్కూల్ తరగతి గదులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వర్షం కురిసిందంటే పాఠశాల పైకప్పు నుంచి వర్షపు నీరు కారడం, గోడలు నెమ్మెక్కి పెచ్చులూడిపడుతున్నాయి. దీంతో గోడలు ఎక్కడ కూలిపోతాయోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడుపుతున్నారు. వర్షం కురిసిందంటే పాఠశాల ఆవరణ అంతా బురదమయమై నడిచేందుకు కూడా విన్యాసాలు చేయాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో నడవలేక కిందపడిపోయే పరిస్థితులున్నాయి. వర్షం కురిసినపుడు తరగతి గదుల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. పాఠశాలలో వున్న 360 మంది విద్యార్థులు ఎక్కడ కూర్చుని చదువుకోవాలో అర్థం కాని పరిస్థితి. త్వరితగతిన పాఠశాలను నూతన భవనంలోకి మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజా ప్రతినిధులను, సంబంధిత ఉన్నతాధికారులను కోరుతున్నారు.



బీటలువారిన తరగతి గది గోడలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

వర్షం కురిస్తే పాఠశాలలో విద్యార్థులకు కలిగే ఇబ్బందులపై తహసీల్దార్, ఎంపీడీఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలకు వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాల్సివుంది.

- హెచ్ఎం ఉమామహేశ్వరమ్మ

నిధుల లేమితోనే..

నిధుల లేమితోనే భవన నిర్మాణం ఆగి పోయింది. తగిన నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తే విద్యార్థులకు సురక్షితంగా ఉంటుంది. పాఠశాల దుస్థితిని గతంలో ఉపాధ్యాయులు నా దృష్టికి తెచ్చిన మాట వాస్తవమే.

- ఎంపీడీఓ కృష్ణమూర్తి

ప్రజా దర్బార్‌కు పోటెత్తిన ప్రజలు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 2: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. గతంలో ప్రజల సమస్యలు పరిష్కారం కాక ఎన్నో కష్టాలు, కన్నీళ్లతో కాలం వెళ్లదీసిన బాధితులకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్ బాధితులకు భరోసానిస్తోంది. ఉదయం 6 గంటల నుంచి మంత్రి ప్రజల అర్జీలు స్వీకరించారు. వందల సంఖ్యలో వస్తున్న ప్రజలను చిరునవ్వుతో పలకరిస్తూ అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, అనంతపురం జిల్లాల వారు కూడా అర్జీలు సమర్పించారు.

భూ సమస్యలపై ఫిర్యాదులు పునరావృతమైతే చర్యలు: కలెక్టర్



క్యూలో నిలబడిన అర్జీదారులు

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 2: భూ సమస్యలపై ఫిర్యాదులు పునరావృతమైతే చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బాధితులు తరలిరావడంతో ..తమ గోడును చెప్పుకునేందుకు గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. కలెక్టర్ వేదిక పైకి రాగానే ఒక్కసారిగా అందరూ ఎగబడడంతో, వారిని అదుపు చేసేందుకు సిబ్బంది తల ప్రాణం తోకకు వచ్చినట్లు అయింది. అప్పటికే డీఆర్‌ఓ, ఎస్‌డీసీ వినతులు తీసుకునేందుకు సిద్ధంగా వున్నా , అర్జీదారులు కలెక్టర్‌కు మాత్రమే అర్జీలు ఇస్తామని మొండికేశారు. గతంలో ఇచ్చిన అర్జీలకు ఇంతవరకు సమాధానం లేదంటూ కొందరు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. చిన్నబిడ్డ తల్లులు కూడా గంటల తరబడి క్యూలో నిలబడి తమ అర్జిని కలెక్టర్‌కే ఇవ్వాలని ఎదురుచూశారు. అర్జీదారుల బాధలు విన్న కలెక్టర్ మండలాలలో అధికారులు తీరు మార్చుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు మళ్లీమళ్లీ రావడం చూసిన కలెక్టర్ కింది స్థాయి సిబ్బందికి చురకలంటించారు. గతంలో జరిగిన అవినీతి, భూ అక్రమాలు పునరావృతం అయితే సహించేది లేదన్నారు. సోమవారం అందిన ఫిర్యాదుల్లో 80 శాతం భూ సమస్యలేనని అధికారులు తెలిపారు. మదనపల్లి సబ్‌డివిజన్ నుంచి ఎక్కుగా ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

ధరల అదుపులో ప్రభుత్వాలు విఫలం : సీపీఐ

- ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు, సెప్టెంబరు 2: ధరలను అదుపు చేయలేని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల తీరు నిరసిస్తూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో మెడలో కూరగాయల దండలు వేసుకుని గ్యాస్ సిలిండర్లు పెట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ పేదల ఆదాయం పెరగకుండా, ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారుతోందన్నారు. ధరలు తగ్గింపు హామీలు కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితమయ్యాయన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువులను ఇవ్వాల్సిన ప్రభుత్వాలు కేవలం బియ్యంతో సరిపెట్టుకుంటున్నాయన్నారు. మోడీ సర్కార్ పెట్టుబడిదారుల అడుగులకు మడుగులొత్తుతోందే తప్ప ప్రజా జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏమాత్రం ప్రయత్నించడం లేదని ఆరోపించారు. ఒకవైపు కొత్త రేషన్‌కార్డుల మంజూరును జనాభా లెక్కలతో ముడిపెడుతూ మరోపక్క రేషన్‌కార్డులు కుదించే యోచనలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారం చేపట్టిన 100 రోజులలో ధరలు తగ్గిస్తామంటూ 2014 ఎన్నికలకు ముందు నరేంద్రమోడీ ఇచ్చిన హామీలు పదేళ్ల దాటినప్పటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ఈ నెల 6వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి ఇమ్మానుయేల్, జిల్లా కార్యవర్గ సభ్యులు వీర శేఖర్, మస్తాన్, పెంచలయ్య, వీరమ్మ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ ఎత్తిపోతల పథకంతో సాగు నీరందిస్తాం



ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, నాయకులు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 2: శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్ట చెరువుకు రెండు రోజుల్లో నీరు అందిస్తామని రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. మండలంలోని కుడమలూరు గ్రామంలో రైతులు టీడీపీ నాయకులతో కలిసి శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. పైపులైనుకు మరమ్మతులు చేయించారు. సోమవారం ఆయకట్టుకు నీరు విడుదల చేసేందుకు విద్యుత్ సమస్య ఏర్పడడంతో, 24 గంటల్లో సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు ఆయన సూచించారు. ఇందుకు సహకరించని విద్యుత్ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం చెరువుకు నీరు విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ వాసుదేవరెడ్డి, టీడీపీ నాయకుడు కొమరా వెంకటనరసయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, చమర్తి మహేష్‌రాజు, మోదుగుల నరసింహులు, శివారెడ్డి, హరినాథ్ రెడ్డిలు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి భారీ విరాళాలు



రూ. 20 లక్షలు విరాళం అందించిన పెనిగలపాటి నారాయణ కుటుంబ సభ్యులు

చిట్వేలి, సెప్టెంబరు 2: మండల పరిధిలోని స్తంభాల రాయుడుస్వామి ఆలయం సమీపంలో నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి భక్తులు సోమవారం 38.86 లక్షల భారీ విరాళాలను అందించినట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త కట్టా రామ్మోహన్‌రావు తెలియజేశారు. నందలూరు మండలం ఆడపూరుకు చెందిన పెనిగలపాటి నారాయణ, సతీమణి రుక్మిణమ్మ కుమారుడు రమేష్‌నాయుడు, కోడలు మహేశ్వరి వారి కుటుంబ సభ్యులు 10,00,116 రూపాయలు విరాళం అందజేశారు. గతంలో కూడా వీరు 10 లక్షల రూపాయలు అందజేశారు. రైల్వేకోడూరు మండలం కె.బుడుగుంటపల్లెకు చెందిన తిరుపతి మోహన్ సతీమణి కాంతమ్మ, కుమారుడు హరికుమార్, కోడలు సత్యవతి, మనవరాళ్లు హాసిని, మోనాలిసా కుటుంబ సభ్యులు 5,00,116 రూపాయలు, పుల్లంపేట మండలం పీవీజీ పల్లెకు చెందిన కిలారి నారాయణయ్య సతీమణి సావిత్రమ్మ, కుమారుడు వెంకటేశ్వరప్రసాద్, కోడలు సుభాషిణి, మనుమరాలు సుజశ్రీ, మనుమడు వర్షిత్ కుటుంబ సభ్యులు 5,00,116 రూపాయలు, చిట్వేలి మండలం గాంధీనగర్‌కు చెందిన బత్తల వెంకటసుబ్బయ్య సతీమణి నారాయణమ్మ, కుమారుడు హరీష్ కోడలు భవాని, కుటుంబ సభ్యులు 1,50,116 రూపాయలు, చిత్తూరు జిల్లా పుత్తూరు మండలం పరమేశ్వర మంగళంకు చెందిన మోటుపల్లి రమేష్‌నాయుడు, సతీమణి ఝాన్సీరాణి, కుటుంబ సభ్యులు లక్ష రూపాయలు, చిట్వేలి మండలం గుడ్లవారిపల్లెకు చెందిన పెనగలూరు నరసింహులు, సతీమణి విజయలక్ష్మీ కుటుంబ సభ్యులు 50,116, రాజంపేట మండలానికి చెందిన కీ.శే. రేపూరు రామయ్య కుమార్తె చెన్నమ్మ కుటుంబ సభ్యులు 20,116, చిట్వేలి మండలం గాంధీనగర్‌కు చెందిన ఓబిలి సుబ్బయ్య సతీమణి రత్నమ్మ కుటుంబ సభ్యులు 15,116 రూపాయలు, మొత్తం 38,86,044 రూపాయలను భక్తులు విరాళాలుగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తూ స్వామి కృపాకటాక్షం ఉండాలని ప్రార్థించారు.

డీసీసీ కార్యాలయానికి షర్మిల



పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను సన్మానిస్తున్న మైనార్టీ నేతలు

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 2: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇడుపుల పాయలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నానికి జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా కాంగ్రెస్ నేతలు అఫ్జల్ ఖాన్, విజయ జ్యోతి, శ్రీరాములు,మధు రెడ్డి, ఎస్.ఎ సత్తార్, బండి జకరయ్య ఇతర నాయకులు, కార్యకర్తలను పిలిపించి విడివిడిగామాట్లాడారు. అనంతరం పలువురు మైనార్టీ నేతలు, పార్మసిస్టులు సమస్యలు పరిష్కరించాలని ఆమెను కోరారు. కాగా, సోమవారం రాత్రికి డీడీసీ కార్యాయంలోనే బస చేసి 3వ తేదీన జిల్లా కలెక్టర్‌ను కలవనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు బెంగళూరు బయలు దేరనున్నారు

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి'

- ర్యాలీలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

వేంపల్లె, సెప్టెంబరు 2: మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థి దశలో మత్తుకు బానిసలు అయితే బతుకు దుర్భరం అవుతుందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా.. వాటి బానిస అయితే కలిగేనష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో సోమవారం ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలు జీవితంలో ఎలాంటి పురోగతి లేకుండా చేస్తాయని, ఇలాంటి వాటికి బానిసలైన ఎందరో జీవితాలను కోల్పోయారని తెలియజెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు మధుసూదన్‌రెడ్డి, ఇందుమతి, సుబ్బరాయుడు, గోవర్ధన్, అకడమిక్ డీన్ రత్నకుమారి, క్యాంపస్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ అవకతవకలపై ఫిర్యాదులకు కాల్ సెంటర్



టోల్ ఫ్రీ నెంబర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 2: గతంలో గృహ నిర్మాణ శాఖలో అవినీతి అక్రమాల, అవకతవకలపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా కార్యాలయంలో కాల్‌సెంటర్ (08561-293086)ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాల్ సెంటర్ ఉదయం 9.00 నుండి సాయంత్రం 6 గంటల వరకు పని చేస్తుందని జిల్లాలోని ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే ఆయా మండలాలకు వెళ్లి సమశ్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తాసుకోవాలని హౌసింగ్ పీడి శివయ్యను ఆదేశించారు. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను అయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ వెంకటసుబ్బయ్య, డీఆర్‌ఓ సత్యనారాయణ, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

9 నుంచి మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), సెప్టెంబరు 2 : జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సెప్టెంబరు 9 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పిలుపునిచ్చారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎన్‌జీవోలు ప్రచురించిన మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల కరపత్రాలను ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీకి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు, యువకులు చదువును నిర్లక్ష్యం చేస్తూ విద్యను కోల్పోతున్నారన్నారు. మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా మంచి నడవడిక, నైతిక విలువలు పెంపొందించుకుని మంచి పౌరులుగా ఎదగాలని యువతకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటరాముడు, జూటూరు విజయ్‌కుమార్, లక్ష్మీదేవి, భువనేశ్వర్‌రెడ్డి, సుభాష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కిడ్నాపర్లపై చర్యలు తీసుకోవాలి

- ఎస్పీకి ఓ మహిళ వినతి

కడప (క్రైం), సెప్టెంబరు 2 : తన కూతురిని కిడ్నాప్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని చక్రాయపేటమండలం అద్దాలమర్రికి చెందిన అన్నపూర్ణమ్మ సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ఎస్పీకి విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన రెండో కుమార్తె(16)ను కిరణ్ అనే వ్యక్తి తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి గతంలో మాయమాటలు చెప్పి తీసుకుని వెళ్లగా, అప్పట్లో తన కూతురు తప్పిపోయిందంటూ చక్రాయపేట పోలీసు స్టేషన్‌లో తాను ఫిర్యాదు చేయగా వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారని తెలిపింది. తరువాత తన కూతురిని తీసుకురావడంతో పోలీసులు ఆమెను కడపలోని హోంలో కొంతకాలం ఉంచి తమకు అప్పగించారు. తన కుమార్తెను ఇంటికి తీసుకుని వచ్చిన మరుసటిరోజే మళ్లీ కిరణ్, తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి కిడ్నాప్ చేసి తీసుకుని వెళ్లారు. మరలా ఆచూకి తెలియరాలేదు. తన కుమార్తెను తమకు అప్పగించి నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ వెంకటరాముడు చక్రాయపేట పోలీసులతో మాట్లాడి వెంటనే నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

4న రాజీవ్ రైతు బజార్‌లో అవగాహన సమావేశం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 2: ఈ నెల 4న బుధవారం ఉదయం 11 గంటలకు మదనపల్లి పట్టణంలోని రాజీవ్ రైతు బజార్‌లో రైతులు, ఫార్మర్స్, ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవోలు) వ్యాపారులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి టీ. త్యాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లి పట్టణంలో రాజీవ్ రైతు బజారును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆగస్టు 27న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు రైతులు, ఫార్మర్స్ ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పీవోలు), ఉద్యాన పంటలు, ఆకుకూరలు పండించే రైతులు, పూలు, పండ్లు, పచ్చిచేపలు, ఎండు చేపలు, రొయ్యల వ్యాపారులు తదితరులతో ఈ నెల 4న మదనపల్లి రాజీవ్ రైతు బజార్‌లో అవగాహన సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, మదనపల్లి మున్సిపల్ కమిషనర్, రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ తదితరులు రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించడంతో పాటు రైతు బజారును పునఃప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు కూడా స్వీకరిస్తారన్నారు. కావున రైతులు, ఎఫ్‌పీవో సభ్యులు, వ్యాపారులు పాల్గొనాల్సిందిగా ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సుండుపల్లె, సెప్టెంబరు 2: అప్పన్నకుంటలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని తహసీల్దార్ దైవాదీనం రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. కుంటను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేయాలని వీఆర్‌వో జయలక్ష్మిని ఆదేశించారు. అనంతరం అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిని పిలిచి మాట్లాడారు. కుంటను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అప్పన్నకుంటలో నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు.

'మరుగుదొడ్ల బాధ్యతల నుంచి టీచర్లను మినహాయించాలి'

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 2: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, ప్రత్యేకించి మరుగుదొడ్ల ఫోటోల బాధ్యత నుంచి తొలగించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌బాబు కోరారు. సోమవారం డీఈఓ అనురాధను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవికుమార్, క్రిష్టారెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే వైఎస్ ఆశయం : తులసిరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 2: రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయమని కాంగ్రెస్ పార్టీనేత, రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో వైఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

వేంపల్లె, సెప్టెంబరు 2: మండలంలోని అలిరెడ్డిపల్లె సమీపంలోని ముళ్లపొదల్లో పేకట జూదమాడుతున్న ఐదుమందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు.వారి నుంచి రూ.12వేలు నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కోర్టులో హాజరుపర్చనున్నామని ఎస్ఐ తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పెండ్లిమర్రి, సెప్టెంబరు 2: మండలంలోని పాపాఘ్ని నదిలో బుడ్డాయి వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ మదుసూదనరెడ్డి తెలిపారు. తమకు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి తదుపరిచర్య నిమిత్తం తహసీల్దార్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు





కడపలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న జనసేన కడప అసెంబ్లీ ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్... కేక్ కట్ చేస్తున్న జనసేన నేత తుంగా రమణయ్య, పెద్ద దర్గాలో ప్రార్థనలు చేస్తున్న తుంగా రమణయ్య

పోరాట యోధుడు పవన్‌కళ్యాణ్ : సుంకర

కడప(ఎర్రముక్కపల్లె)/కడప మారుతీనగర్, సెప్టెంబరు 2 : రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కడప నగరం జనసేన పార్టీ కార్యాలయంలో రెడ్‌క్రాస్, బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో పవన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గారక్తదాన శిబిరం నిర్వహించారు. జనసేన జిల్లా కో ఆర్డినేటర్, కడప అసెంబ్లీ ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్, మరో 47 మంది జనసేన నాయకులు రక్తదానం చేశారు. బైకు ర్యాలీగా వెళ్లి ఆర్టీసీ బస్టాండు కూడలిలో అంబేడ్కర్ సర్కిల్‌లో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం దేవునికడప వెంకటేశ్వరస్వామిసన్నిధిలో 101 కొబ్బరికాయలను కొట్టి మొక్కులు తీర్చారు. అలాగే 101 మొక్కలను నాటారు. జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటరు పత్తివిశ్వనాథ్, నగర కమిటీ అధ్యక్షుడు బొరెడ్డి నాగేంద్ర, జనసేన సీనియర్ నాయకులు మాలే శివ, జీవీ రమణ, సాయిస్వరూప్, భగత్, శేషు, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రేమికుడు పవన్‌కళ్యాణ్

ప్రకృతి ప్రేమికుడు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అని జనసేన కడప అసెంబ్లీ ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ కొనియాడారు. జనసేన నాయకులు జి.వి. రమణ, మాలే శివ ఆధ్వర్యం లో గోకుల్ సెంటర్ రోడ్లపై క్లీన్ ఆంధ్ర, గ్రీన్ ఆంధ్ర పేరుతో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. బైక్ ర్యాలీ నిర్వహించారు.

పేదల మనిషి పవన్ కళ్యాణ్

● జనసేన నేత తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 2:పేదల మనిషి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని జనసేన జిల్లా నాయకుడు తుంగా రమణయ్య కొనియాడారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కడప నగరంలో తుంగా రమణయ్య ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దేవుని కడపలో పూజలు నిర్వహించి పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ కార్యాయలంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో గల 50 డివిజన్ల పార్టీ కార్యకర్తలు, జనసైనికులతో కేక్ కట్ చేయించి సంబరాలు జరుపుకున్నట్లు తెలిపారు.

చిరంజీవి యువత ఆధ్వర్యంలో...

కడప నగరం సంధ్యా థియేటరు ఆవరణంలో చిరు యువత ఆధ్వర్యంలో పసల బాలాజీ, ప సల హరి నిర్వహించిన అన్నదాన కార్యక్రమం లో పంద్ర రంజిత్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మన సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాట యోధుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. పవన్‌కు ఎంతో ఇష్టమైన డొక్కా సీతమ్మ స్ఫూర్తితో భవన నిర్మాణ కార్మికులకు అన్నదానం చేయడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్, షేక్ హుసేన్, హర్ష, పవన్,రిషి, కార్తీక్, సాయి, బాబునాయక్, కుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో రక్తదానం

వేంపల్లె, సెప్టెంబరు 2: వేంపల్లెలో జనసేన పులివెందుల ఇన్‌చార్జి హరీష్ ఆధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మందికి పైగా రక్తదానం చేసినట్లు హరీష్ పేర్కొన్నారు.

సీకేదిన్నెలో... చింతకొమ్మదిన్నె మండలంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, జనసేన కమలాపురం ఇన్‌చార్జి ఇందిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేసి అన్నదానం ప్రారంభించారు.జనసేన డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వాకా రెడ్డిప్రసాద్, జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పులివెందులలో... పులివెందులలో ఆలూరు జగదీశ్‌బాబు ఆధ్వర్యంలో లీలావతి వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లింగాల మండలం జనసేన నేత మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నూరులో...చెన్నూరులో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అద్దంకి విశ్వనాథ్, ఉపాధ్యక్షు డు శివశంకర్ ఆధ్వర్యంలో పవన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. టీడీపీ నేత విజయ భాస్కర్‌రెడ్డి, బలిజ సంఘం జిల్లా నాయకుడు ఆకుల ప్రసాద్‌బాబు, బీజేపీ నేతలు మాదినేని రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పంద్ర రంజిత్‌కుమార్



సీకేదిన్నెలో అన్నదానం చేస్తున్న పుత్తా నరసింహారెడ్డి

జానపద పురస్కారం అందుకున్న 'మూల'



పురస్కారాన్ని అందుకుంటున్న ప్రొఫెసరు మూల మల్లిఖార్జునరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 2 :జానపద సాహిత్య పరిషత్, హైదరాబాదు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి సింధూరి సంకల్ప లలిత కళానిలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పూర్వ ముఖ్య సలహాదారు డాక్టర్ రమణాచారి చేతుల మీదుగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసరు మూల మల్లిఖార్జునరెడ్డి, జానపద సాహిత్య పురస్కారాన్ని స్వీకరించారు. ఆయనకు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యంతో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి: కమిషనర్

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 2 : కడప కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలని కమిషనరు మైఓ నందన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కడప కార్పొరేషన్ మీడియా కాన్ఫరెన్స్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు తీసుకుని సంబంధిత అధికారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వారం వచ్చిన సమస్యలను ఏ మేరకు పరిష్కరించారో వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుతం వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో ఎంఆర్ఎఫ్ ప్రాధాన్యం

వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) బాగా పనిచేస్తుందని కమిషనరు నందన్ తెలిపారు. సోమవారం ఎంఆర్ఎఫ్‌ను పరిశీలించారు. కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగ అధికారులు, శానిటేషన్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

సోదరభావంతో పండుగలు జరుపుకోవాలి: సీఐ

కడప (క్రైం), సెప్టెంబరు 2 : పండుగలను హిందూ, ముస్లిం, క్రిష్టియన్లు అందరూ కలిసి సోదరభావంతో జరుపుకోవాలని ఒకరి మతాన్ని మరొకరు గౌరవించుకున్నప్పుడే శాంతిభద్రతలతో ఎలాంటి సమస్యలు ఉండవని కడప టూటౌన్ సీఐ నాగార్జున సూచించారు. టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం పీస్ కమిటీతో సమావేశం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగార్జున

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోండి: ఎస్ఐ

సింహాద్రిపురం, సెప్టెంబరు 2: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సింహాద్రిపురం ఎస్ఐ తులసినాగప్రసాద్ సూచించారు. సోమవారం సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడు సింగిల్ విండో విధానంతో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లకు అనుమతులు సులభతరం చేసిందన్నారు.

చవితి పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోండి

వల్లూరు, సెప్టెంబరు 2: వినాయకచవితి పండుగను అందరూ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకోవాలని కమలాపురం సీఐ రోషన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో 14 గ్రామ పంచాయతీలకు చెందిన వినాయక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక విగ్రహాన్ని మట్టితో చేసుకోవాలన్నారు. పండుగ ఉత్సవాల్లో పోలీసుల నిబంధనల మేరకే వ్యవహరించాలన్నారు.

'రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవు'

చెన్నూరు, సెప్టెంబరు 2: ఒక వర్గాన్ని, ఒక మతాన్ని కించపరిచే విధంగానూ, మాటలతో అల్లర్లు, గొడవలు సృష్టించే విధంగానూ వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని సీఐ పురుషోత్తంరాజు హెచ్చరించారు. సోమవారం చెన్నూరులో ఆయన మాట్లాడుతూ ఇటీవల సోషల్ మీడియాలో కొన్ని గ్రూపుల్లో కొందరు వ్యక్తులు రెచ్చగొట్టేలా పోస్టు చేస్తున్నారని, దీని ద్వారా అల్లర్లు, గొడవలు జరిగే అవకాశం ఏర్పడుతుందన్నారు.

విషద్రావణం సేవించి మహిళ ఆత్మహత్య

కడప(క్రైం), సెప్టెంబరు 2: కడప నగరం వైజంక్షన్ వద్ద నారాయణమ్మ (70) విషద్రావణం సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు చిన్నచౌక్ సీఐ తేజమూర్తి తెలిపారు. సీఐ వివరాల మేరకు... వైజంక్షన్ సమీపంలో నివాసం ఉండే నారాయణమ్మ సోమవారం రాత్రి తమ ఇంట్లో విష ద్రావణం సేవించడంతో కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు బాధితులకు పరిహారం అందించాలని ర్యాలీ

చక్రాయపేట, సెప్టెంబరు 2: ఆగస్టు 26వ తేదీన గువ్వలచెరువు ఘాట్‌లో ప్రమాదానికి గురైన చక్రాయపేట వాసులకు ప్రభుత్వం పరిహారం అందించాలని సోమవారం రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, జిల్లా బీజేపీ ప్రధానకార్యదర్శి గాలి హరిప్రసాద్, దొంతు సుమన్, ఉపాధ్యక్షుడు సోము దశరథ, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దేశంలోనే అగ్రగామి బీమా సంస్థ ఎల్ఐసి'

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 2: భారతదేశంలోనే జీవిత బీమా సంస్థ అగ్రగామి అని ఎల్ఐసి కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి. రవికుమార్ పేర్కొన్నారు. ఎల్ఐసి 68వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఆ సంస్థ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలసీదారుల ఆకాంక్షల మేరకు ప్రస్తుతం 41 రకాల వ్యక్తిగత బీమా, 12 రకాల సామూహిక బీమా పథకాలను సంస్థ అందిస్తోందన్నారు. ఇప్పటి వరకు ఎల్ఐసి 2048 బ్రాంచ్‌లు, 1584 సాటిలైట్ కార్యాలయాల ద్వారా 14 లక్షల మంది ఏజెంట్లతో, అలాగే 98 వేల మంది ఉద్యోగులతో 74 కస్టమర్ జోన్‌లతో నిర్వహిస్తున్నారన్నారు. విలేకరుల సమావేశానికి ముందుగా ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ లక్ష్మీతులసి హాజరై మాట్లాడారు.

కొండపేట సమస్యలపై కలెక్టరుకు వినతి

చెన్నూరు, సెప్టెంబరు 2 : మండలంలోని కొండపేట గ్రామంలోని సమస్యలపై అదే గ్రామానికి చెందిన ప్రజలు, టీడీపీ నేతలు, చక్కెర కర్మాగారం మాజీ కార్మిక నేతలు కలెక్టరుకు వేర్వేరుగా సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద వెంకటరాముడు మాట్లాడుతూ జనం విషజ్వరాల బారిన పడుతున్నారన్నారు. జ్వరాలను అరికట్టడంలో స్థానిక వైద్య, ఆరోగ్య సిబ్బంది సరిగా స్పందించడం లేదన్నారు. టీడీపీ నేత బాలక్రిష్టారెడ్డి మాట్లాడుతూ సచివాలయం ఎదురుగా పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లేదారి ఆక్రమణకు గురై కుంచించుకుపోయిందన్నారు.

ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు

పలు చోట్ల రక్తదానం, అన్నదానం, మొక్కలు నాటిన అభిమానులు, కూటమి నాయకులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 2: జమ్మలమడుగులో సోమవారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జనసేన నియోజకవర్గ కన్వీనర్ నల్లంశెట్టి నాగార్జున, డేరంగుల జగదీష్ తదితర జనసేన కార్యకర్తలు పలగా డివీధి ,ఎంపీడీవో కార్యాలయం వద్ద వసతి గృహంలో కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచిపెట్టారు. అక్కడినుంచి ప్రొద్దుటూరు రోడ్డులో డీఎస్పీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. జనసేన కార్యకర్తలు, ఇతరులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, జనసేన నాయకులు నల్లంశెట్టి నాగార్జున తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పవన్‌కుమార్, సుబ్బు, పుల్లయ్య, అనంతగిరి, కిరణ్‌రాయల్, మహబూబ్‌బాష, వినయ్‌కుమార్, ఉదయ్‌కుమార్, హుస్సేన్‌వల్లి, ఎ.జావీద్, వనం గురుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు..: పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో జనసేన నాయకులు, బలిజసేవాసంఘం, కూటమి నాయకులు, అభిమానుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలో పలుచోట్ల మొక్కలునాటారు. అనంతరం పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి బర్త్‌డే కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకుడు, టీడీపీ సీనియర్ నాయకులు రాగిమాను ప్రతాప్ కుమార్, జనసేన సీనియర్ నాయకుడు తుడిమెళ్ల మురళీకృష్ణ, బలిజసంఘం ప్రధాన కొర్రపాటి సురేంద్ర, మస్తాన్ బాబు, లకిడి విజయ్‌భాస్కర్, కొంకుల రామక్రిష్ణ, రవి, కొంకుల రాంబాబు, వెంకటసుబ్బయ్య, శింగసాని రవికుమార్ (బుజ్జి) , సుధీర్, పందుగాయల రమణయ్య, ప్రశాంత్, దద్దం నాగార్జున, ముంతల రాము పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు పోరుమామిళ్లలో ఘనంగా జరిగాయి. సోమవారం పోరుమామిళ్ల జనసేన మండల నాయకులు శీలంశెట్టి లక్ష్మయ్య, జనసేన వీర మహిళ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జనసేన కార్యాలయంలో సర్పంచ్ యనమల సుధాకర్, బద్వేలు టీడీపీ నాయకుడు రాంబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేక్ కట్ చేసి పంచారు. అనంతరం రామచంద్ర రిక్రియేషన్ క్లబ్ వరకు ర్యాలీ చేసి రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, రాజేశ్, ప్రసన్న,బాల ఓబయ్య, శెట్టెం ప్రతాప్, లక్ష్మణరావు, మద్దిలేటి,బాలచంద్ర,వెంకటేశ్వర్లు, సిద్దయ్య పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం..: జనసేన నాయకుడు మాదాసు మురళి కార్యాలయంలో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం రాష్ట్ర కార్యదర్శి అల్లం చంద్రశేఖర్ , నాయకులు బాలభాస్కర్‌రెడ్డి, అబ్బాస్, హరిష్, కేశవ్, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, సంతోష్ పాల్గొన్నారు.

కొండాపురం..: జనసేనాని పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు తాళ్లప్రొద్దుటూరులో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు బుగ్గన గారి చంద్రశేఖర్‌రెడ్డి,నరసింహ, ద్వారకనాథరెడ్డి,ముకుంద్, గౌస్‌పీర్‌పాల్గొన్నారు.

ముద్దనూరు..: స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు జనసైనికులు ఘనంగా జరుపుకున్నారు.జనసేన నాయకులు నాగార్జున, జగదీష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిరణ్, చంద్ర, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ అరాచకపాలనను తరిమికొట్టడంలో పవన్ కళ్యాణ్ ది కీలక పాత్ర అని జనసేన నేత లు జిలాన్, రామారావు, సుంకరమురళి పేర్కొన్నారు. సోమవారం పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనాథ పిల్లలకు అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. డీమార్ట్ దగ్గరనుంచి శివాలయం సర్కిల్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి పవన్ కళ్యాణ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. జనసేన నేతలు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నియోజకవర్గ బాధ్యుడు పందిటి మల్హోత్ర పిలుపునిచ్చారు.స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి.వనిపెంట గురుకుల పాఠశాలలో నాయకులు పాశం లక్ష్మీనరసయ్య మొక్కలు నాటారు. జనసేన నాయకులు క్రిష్ణమూర్తి, రామగోవింద్, దుర్గా జువెలర్స్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: మండల కేంద్రంలోని ఐదురోడ్ల కూడలిలో సోమవారం పవన్‌కళ్యాణ్ జన్మదిన సందర్భంగా జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి సభ్యులందరూ కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, నాయకులు ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, ముడుమా ల పోలిరెడ్డి, సాంబ శివారెడ్డి ముఖ్య అతిథులుగా హాజర య్యారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగరాజు, మురళి, జనసేన వార్డుమెంబరు రాజేశ్, రవి, కల్లూరు సద్దాం, పూజా శివయ్యయాదవ్, నరసింహగౌడ్, ఆవుల దస్తగిరి, వినోద్,పోలా శ్రీను, సుధాకర్, రమణ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి
జమ్మలమడుగులో రక్తదానం చేస్తున్న దృశ్యం



బద్వేలులో మొక్కలు నాటుతున్న నాయకులు



పోరుమామిళ్లలో రక్తదానం చేస్తున్న నాయకులు

ఊరేగింపుల్లో మంటపాల వద్ద డీజేకి అనుమతులు లేవు

ఆర్డీవో శ్రీనివాసులు, కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 2 : వినాయక విగ్రహాలు తీసుకు వచ్చేటప్పుడు, ఊరేగింపుల్లో డీజే పెట్టడం, బాణాసంచాలు పేల్చడానికి అనుమతులు లేవని ఆర్డీవో శ్రీనివాసులు, కమిషనర్ రఘునాథరెడ్డి ప్రకటించారు. సోమవారం స్థానిక మున్సిపల్ సభాభవనంలో వినాయక ఉత్సవ విగ్రహ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంటపాలలో మట్టి వినాయక విగ్రహాలు మాత్రమే నెలకొల్పాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు పర్యావణానికి హానికరమన్నారు. ప్రతి రెండు మంటపాలకు ఒక పోలీసును పర్యవేక్షణకు పెడతామన్నారు. ప్రతి మంటపం వారు వివరాలు అందజేయాలన్నారు. మంటపాలు, విగ్రహాలకు విద్యుత్ లైట్ల ఏర్పాటులో సరఫరాలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి మంటపం వద్ద భక్తి పాటలు పెట్టాలన్నారు. భక్తిని అపహాస్యం చేసే పాటలు, డ్యాన్సులు చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు గంగయ్య, సీఐలు రామక్రిష్ణారెడ్డి, గోవిందరెడ్డి, బాలమద్దిలేటి, ఎస్‌ఐలు, విద్యుత్ శాఖ అధికారులు, ఉత్సవ విగ్రహ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ కాంట్రాక్టు కార్మికులపై వివక్ష తగదు'

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 2: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి వివక్ష తగదని ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో కాంట్రాక్టు కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేస్తానని మోసం చేసిందన్నారు. కనీసం ఈ ప్రభుత్వ అయిన తెలంగాణా తరహాలో పర్మనెంట్ చేయాలని చంద్రబాబును కోరతామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు 2022 ఏప్రిల్ నుంచి వేతనాలు పెంపుదల చేయాల్సి ఉండగా 2023 ఆగస్టు నుంచి వేతనాలు పెంచారని, 16మాసాల పీఆర్‌సీ అరియర్స్ కూడా చెల్లించాలని కోరుతామన్నారు. ఈ సమావేశంలో కాంట్రాక్టు కార్మిక నాయకులు చంద్రశేఖర్, గంగయ్య, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు.

రేపు విద్యుత్ అదాలత్

బద్వేలు, సెప్టెంబరు 2: బద్వేలు సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 4వతేదీన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏడీ కుళాయప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు డివిజన్ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, వనిపెంట, చాపాడు, గోపవరం, అట్లూరు, పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, కాశినాయన విద్యుత్ వినియోగదారులు పాల్గొని సమస్యలు రాతపూర్వకంగా ఫిర్యాదు ద్వారా తెలియజేయాలన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు



మడూరు కాలువలో పూడికతీస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 2 : పట్టణంలోని ప్రధాన మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీత పనులను మొదలు పెట్టారు. సోమవారం మడూరు కాలువ చివరి పాయింట్ దగ్గర నుంచి మురుగు తొలగించే పనులను ఎక్స్‌కవేటర్‌ను కాలువలో దించి ట్రాక్టర్లకు పూడికను ఎత్తిపోశారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'మురుగుతొలిగేనా' కథనానికి స్పందించిన కమిషనర్ రఘునాథరెడ్డి కాంట్రాక్టర్లతో చర్చించి పనులు మొదలు పెట్టించారు. ఈ పనులను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్వయంగా వచ్చి పూడికతీత పనులను పరిశీలించారు. పూడిక తీతకు ముందు నీళ్ళు తొలగించి పూడిక ఎత్తివేయాలని ఆయన సూచించారు. పూడిక తీసేటప్పుడు మున్సిపల్ ఇంజనీర్లు పర్యవేక్షించాలన్నారు. బిల్లులు చేసేటప్పుడు కూడా పనులు పూర్తి స్థాయిలో జరిగి వుంటేనే చేయాలని ఆదేశించారు. ఈ పనులను మున్సిపల్ ఈఈ సాయిక్రిష్ణ ,డీఈ ప్రభాకర్ దాస్ తదితరులు పర్యవేక్షించారు.

బంగ్లాదేశ్‌లో హిందూ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 2 : బంగ్లాదేశ్‌లో హిందూ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య కోరారు. సోమవారం ఏపీటీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ హిందూ ఉపాధ్యాయులను బలవంతంగా వత్తిడి చేసి రాజీనామాలకు చేయించడం అమానుష చర్య అన్నారు. సమావేశంలో బాలరంగయ్య, కేశవ, నారాయణరెడ్డి, బొల్లు వెంకటరమణ, దండు సుబ్బారెడ్డి, కుందారపు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ క్రికెట్ టోర్నీ విజేత బి.మఠం జట్టు

బద్వేలు రూరల్, సెప్టెంబరు 2 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 15న ప్రారంభమైన నియోజకవర్గస్థాయి ఉపాధ్యాయ క్రికెట్ టోర్నమెంటు ఫైనల్ మ్యాచ్‌లో బ్రహ్మంగారిమఠం మండల టీమ్ విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు బి.కోడూరు ఎంఈవో మూరతోటి సునీల్ తెలిపారు. ఫైనల్ మ్యాచ్ బహుమతుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బద్వేలు, కడప డివిజన్ల ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గస్థాయిలో ఉపాధ్యాయులందరినీ ఒక చోటికి చేర్చి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో బద్వేలు, బ్రహ్మంగారిమఠం టీమ్ పోటీపడగా బి.మఠం జట్టు విజేతగా నిలిచింది. బి.మఠం టీంకు చెందిన సుభాన్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ బహుమతి ప్రదానం చేశారు. అలాగే ఫైనల్ పోటీల్లో పాల్గొన్న ఇరుజట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హాకీ సీనియర్ ప్లేయర్ విలియంరాజు,నసీంబాషా,శివకుమార్, నాగసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి : తహసీల్దారు

కాశినాయన సెప్టెంబరు2: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందజేసే ప్రతి అర్జీని అధికారులు తప్పక పరిష్కరించాలని తహసీల్దారు బాల నరసింహులు పేర్కొన్నారు. సోమవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసమావేశానికి అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని నిబంధనలు ఉన్నా అగ్రికల్చర్,అంగన్వాడి శాఖల వారు తప్ప మిగిలిన అధికారులు హాజరుకాలేదు. గైర్హాజరైన అధికారులపై జిల్లా అధికారులకు తెలియజేస్తానన్నారు.

'వలంటీర్లకు వేతనాలు ఇవ్వాలి'

జమ్మలమడుగు, సెప్టెంబరు 2: వలంటీర్లకు సెప్టెంబరు 15వ తేదీలోగా పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఏఐవైఎఫ్ అనుబంధం ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎన్నికల హామీల ప్రకారం రూ.10 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు రాజీనామాలు చేసిన వలంటీర్లను కొనసాగించాలని, గౌరవ వేతన బకాయిలను చెల్లించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, దేవదాసు, హరినాగార్జునరెడ్డి, తిమోథి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం చేయండి

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 2 : ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేయాలని కంటి వైద్య అధికారి కేజే రఘురామిరెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో రాజీవ్ సర్కిల్ నుంచి శివాలయం సర్కిల్ వరకు 6 అర్బన్ ప్రాథమిక వైద్య అధికారులు సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలతో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు విరివిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అధికారి తేజ, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, ఎంపీహెచ్ఈవో సుబ్బరాయుడు పాల్గొన్నారు.

విగ్రహాలు నిలపడానికి పోలీసుల అనుమతి ఉండాలి : డీఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 2 : వినాయక చవితి పండుగ, గణేశ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా విగ్రహాలు నిలుపడానికి తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా సిబ్బందిని ఉంచుకోవాలన్నారు. విగ్రహాల వద్ద, నిమజ్జనం రోజున ఎటువంటి రంగులు ఇతరులపై చల్లరాదన్నారు. రాత్రి 10 గంటలలోపు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు..

ఘనంగా వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి

జమ్మలమడుగు, సెప్టెంబరు 2: జమ్మలమడుగులో సోమవారం దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, జమ్మలమడుగులోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మరికొంతమంది కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ముల్లాజానీ, కిరణ్, సింగరయ్య, కో-ఆప్షన్ మెంబర్ గజ్జెల లక్షుమయ్య, మార్బుల్ శ్రీను, భాస్కర్‌రెడ్డి, తానేషావలి, రమణారెడ్డి, బాబు, తదితర నాయకులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న వైసీపీ నేతలు